ప్రకృతి నవ్వింది

“ఆరెస్సింగ్”

దుర్మార్గాన్ని మనసులాగుంది రోదసి. నవమి చంద్రుడింకా పొడసూపలేదు. రాత్రి రెండో జాము దాటింది.

“ఇవ్వాళ వీడంతేమిటో చూడాల్సిందే. డ్రైవరు వెధవ, లారీ ఆపకండా దూసుకుపోతాడా! వీడి తలబిరుసుతన మేమిటో యివ్వాళ తేలిపోవాల్సిందే.” కొబ్బరి మోసుతో తమ్మిలేటి వంతెన కమ్మీలకు ఏనుగు మెలిక వేస్తూ కోపంగా అనుకుంటున్నాడు, చౌకీదారు కిష్టయ్య.

బ్రిటీషువారి హయాంలో, రేషనింగ్ అమల్లో ఉన్న రోజుల్లో, అన్ని పట్టణాల ఔట్‌పోస్టుల దగ్గర ప్రతి రాస్తాకూ ఒక చౌకీదారును ప్రభుత్వం నియమించేది. అతగాడు, వచ్చే పోయే యేవిధమైన వాహనాలను గానీ, మనుష్యులను గానీ తనిఖీ చెయ్యడానికి అధికారం గలవాడు. ఏ ప్రదేశాన్నుండీ గానీ మరో చోటికి, ప్రభుత్వవారి అనుమతి పత్రము లేనిదే, ధాన్యము, అపరాలు మొదలుగా గల ఆహార పదార్థాలు తీసుకువెళ్ళడం చట్టరీత్యా శిక్షార్హం.

కిష్టయ్య ఏలూరుకు ఈశాన్యదిశ నున్న ఔట్‌పోస్టులో చౌకీదారు. వస్తుతః మంచివాడు. నిజాయితీని చర్యల ద్వారా నిరూపించడమే ధ్యేయంగా గలవాడు. అయినా అతడు జీవితంలో అనుకున్నదేమీ సాధించలేకపోగా, అపహాస్యపు పాలవడానికి కారణం అతనిలో కొంచెం లౌక్యం లోపించడమే కావచ్చు.

సత్యాన్ని పరిశోధించడంలో తమ జీవితాల్నే అర్పించారు మహాత్ములు. తత్పర్యవసానంగా యేర్పడిన ఋజు రేఖమీద జీవితాన్ని సూటిగా నడిపించాలంటే మనిషికి ఎంతో నేర్పు, ఓర్పు అవసరం. సమాజంలో అనుక్షణం తలెత్తే అసూయ ద్వేషాల ఆటుపోటులను నిభాయించుకునే సంరంభంలో, ఆవేశాలకు లోనై అసలు జీవిత దృక్పథాలనే విస్మరించక, నిండుగా నిలబడగలిగే ధీశక్తి, మనిషిలో నిద్రాణంగా ఉండి, అదను దొరికిందే తడవుగా విజృంభించే పాశవిక శక్తుల్ని జోకొట్టగల సమర్థత, సత్యనిరతి—సమపాళ్ళలో నిబిడీకృతమైయున్న కార్యదక్షుడు మాత్రమే తన లక్ష్యం గురి చెదరకుండా పయనించగల్గుతాడేమో!

కిష్టయ్యకు చాలా కోపంగా ఉంది. మూడు సంవత్సరాలుగా అతడు చౌకీదారుగా ఉంటున్నాడు, కానీ యిలాంటి మొండితనం అతని కెప్పుడూ అనుభవంలోకి రాలేదు. మూడు రోజులుగా ప్రయత్నిస్తున్నా డ్రైవరు లారీని ఆపడంలేదు. అందుకే కిష్టయ్య మొండితనాన్ని మొండిగానే జయించాలనే సంకల్పంతో తమ్మిలేటి వంతెనకు అడ్డంగా మోకు కట్టాడు. లారీ, తమ్మిలేరు మీదుగానే వెళ్ళాలి.

లారీ నిండుగానే వెడుతుంది రోజూ. అంటే ఏదో మోసుకుని వెడుతున్నట్టే. బ్లాక్‌మార్కెట్‌దారుడెవడో యీపని చేయిస్తున్నాడని, కిష్టయ్య అనుమానం. అనుమానం వచ్చిన దాదిగా కిష్టయ్య హృదయం కుతకుతలాడుతోంది. కరువు దేశం నలుమూలలా విలయతాండవం చేస్తోంది. పేదవాడికి నూకగింజలు దొరకడం గూడా దుష్కరమైపోయింది. పాపం, రెక్కలాధారంగా బ్రతికే వాళ్ళంతా డొక్కలు మాడి, గంజినీళ్ళకోసం గిజగిజలాడుతూ ఒక జిల్లా నుండి మరొక జిల్లాకు రైలుబండ్లమీద వచ్చి, నూకా, నుచ్చూ కొనుక్కుపోతున్నారు. వాళ్ళ పరిస్థితి అంతటి దైన్యానికీ, హైన్యానికీ దిగజారడానికి మూలకారణం యీ నల్లబజారు వర్తకులేనని కిష్టయ్య దృఢమైన విశ్వాసం. అందుకే వాళ్ళంటే అతనికి కడుపుమంట. బియ్యపుమూటలు పట్టుకెళ్లే వాళ్లను కిష్టయ్య చూచీ చూడనట్టు వదిలేయడంపరిపాటి.

తలకు టర్కీతువ్వాలు చుట్టుకున్నాడు. కిష్టయ్య రివటగాలి వీస్తుంటే. పంచె ఎగగట్టాడు. వంతెనకు దిగువ ఉన్న తన పోస్టులోనికి వెళ్లాడు. టార్చిలైటు చేతో పట్టుకున్నాడు. లారీకోసం ఎదురుతెన్నులు చూస్తూ అటూ యిటూ తిరుగుతున్నాడు.

తమ్మిలేరు డొక్క లెండుకుపోయి యిసుకమేటలు వేసింది. అక్కడక్కడ నీరు గోతుల్లో మిగిలింది, యిగిరి పోతున్న ఆశాలేశంలా. తమ్మిలేటి వంతెనకు ఫర్లాంగు దూరంలో రైలు బ్రిడ్జి ఉంది. మరో ఫర్లాంగు దూరంలో తమ్మిలేరు కృష్ణ కాలువలో లీనమౌతుంది. ఆ సంగమ స్థలంలో మరో వంతెన తమ్మిలేరుపై కట్టబడింది. దానికి, నీటి ఉధృతాన్ని అరికట్టడం కోసం తలుపులు బిగించబడి ఉంటయ్. తమ్మిలేరు ఆ తలుపులగుండా పోయి పోయి కొల్లేటి సరస్సులో కలిసిపోతుంది. కిష్టయ్య రహదారి వంతెన మీదినుండి పార జూస్తున్నాడు. కిష్ణ కాలువలో పడవ నిలబడి ఉంది. పడవలో దీపం మినుకు మినుకు మంటోంది. కృష్ణ నీటి మట్టం తగ్గింది. ఏలూరు తూర్పు లాకు వద్ద పడవలు ఆగడం తప్పనిసరి. లాకు కృష్ణ కాలువను, గోదావరి కాలువను కలిపే పవిత్ర సంగమం కూడా. ఏకాదశి స్నానాలకు జనం ఇసుకవేస్తే రాలకుండా వస్తారు. పడవల్లో కూడా ధాన్యం దొంగతనంగా చేరవేస్తుంటారు. కిష్టయ్య పడవవాళ్లను బెదరవేస్తుంటాడు—

రైలుకూత వినబడింది.

గబగబా అంగలు వేసుకుంటూ పోస్టు దగ్గర కొచ్చాడు కిష్టయ్య. అక్కడకు మూడు ఫర్లాంగుల దూరంలో జి. ఎన్. టి. రోడ్డు కడ్డంగా రైలుగేటుంది. బండి వెళ్లిపోతే గేటు తీస్తారు. బండ్లొస్తయ్. లారీ రావచ్చు.

డబడబమని గోల చేసుకుంటూ రైలు కదిలిపోయింది. ఆత్రంగా చూస్తున్నాడు కిష్టయ్య లారీకోసం. లారీ రాలేదు. హృదయావేగం నీరసించింది. చౌకీపోస్టు వసారాలో ఈత చాపమీద చతికిలబడ్డాడు కిష్టయ్య. దీర్ఘంగా నిశ్వసించాడు. పైకప్పు పెంకుల్లో నుంచి 'కీచు' మంటూ వచ్చి, అటూ యిటూ తచ్చాడి, కిటికీగుండా బయటికి పోయింది గబ్బిలం.

అంతా కలిసి చౌకీపోస్టు ఒక గది వసారా మాత్రమే. హరికేను లాంతరు మసగ్గా వెలుగుతోంది. గదినిండా ఎండుగడ్డి పరకలు చెదురు మదురుగా పడిఉన్నయ్. కిటికీవైపు బల్లవాల్చిన గడ్డి ఒత్తుగా పరచబడి దానిమీద తాటాకుల చాప, దానిపైన పాత పరుపు, మాసిన దిండు, దుప్పటి—దుమ్ము కొట్టుకుని ఉన్నయ్. లాంతరుకు సమీపంలో, పరుపుకు తలగడవైపు తెలుగు పత్రిక ఉంది. ప్రక్కనే ఎర్రట్ట పుస్తకం మీద 'తారకామృతసారం' అన్న అక్షరాలు పెద్ద సైజులో కనబడుతున్నయ్. తెల్ల కాగితాల పుస్తకం ఒకటి తెరవబడింది. ఒక పేజీలో అక్షరాలు గజిబిజిగా, గొలుసు కట్టులో కనబడుతున్నయ్. కిష్టయ్య ఏవో పాటలు గిలుకుతూ ఉంటాడు.. పగలు తీరుబడిగా ఉన్నప్పుడు తారకామృతసారంలోని తత్త్వాలు ఆలపిస్తూ, అర్థాన్ని వివరిస్తూ ఉంటాడు అక్కడ చేరే చర్మకారులకు. గది మూల వ్రాసుకునేందుకు అనువుగా ఏటవాలుగా చెయ్యబడిన చెక్క పెట్టె ఉంది. దానిమీద పింగాణి సిరాబుడ్డి, అందులో కలం మూగగా ఉన్నై. కిష్టయ్య ఆ పెట్టె ఎత్తుంచుకుని రాస్తుంటాడు. పెట్టెమీద వచ్చే పొయ్యే వాహనాల పేర్లను, నంబర్లను నమోదు చేసుకునే ఖద్దరు రంగు కాగితాల డైరీ ఉంది. పర్మిట్లు కలిగిన బండ్లను వాటి తాలూకు రశీదులను నమోదు చేసుకునే రిజిస్టరు కూడా అక్కడే ఉంది. పెట్టె మీద కలం ఉంచుకునే గాడిలో కుంకుమరంగు పిడి వేయబడిన 'చక్కర గుత్తి' ఉంది. దాన్ని బియ్యం తోడే గొట్టం అని కూడా వ్యవహరిస్తారు. ఉక్కు రేకును 'కిళ్లీ' వలె మొన దేలేటట్లు మడిస్తే, మధ్య గుల్లగా గాడి ఏర్పడుతుంది. దాన్ని పిడికి అమర్చి నిండు బస్తాకు గుచ్చి వెనక్కు తీస్తే బస్తాలో ఉన్న పదార్థ మేదైనా, చక్కరగుత్తి గాడిలోనికి వచ్చేస్తుంది హాయిగా. గోడకు లాఠీకర్ర వ్రేలాడుతోంది. లాఠీ చివరనున్న కన్నంలో నుండి దూరి కట్టబడిన సన్నని వారుముక్క ఆధారంగా. కిష్టయ్య ఏదైనా బండి మధ్య బస్తాల్లో ఏముందో తెలుసుకోవాలంటే, చక్కరగుత్తిని లాఠీకి కట్టి, బండి మధ్యలో పొడిచి, వెనక్కు లాగి చూసి సందేహ నివృత్తి చేసుకుంటాడు. గోడనున్న మరో మేకు నుండి, దీర్ఘ చతురస్రంగా ఉన్న ఊదారంగు గుడ్డ పటకా కొసల ఆధారంగా వ్రేలాడుతోంది. దాన్ని 'బాడ్జి' అంటారు. దానికి నాలుగు వైపులా తెల్ల కుట్లు, వాటి మధ్య 'సి. హెచ్' అన్న ఇంగ్లీషు అక్షరాలు తెల్ల గుడ్డతో కుట్టబడినవి. 'బాడ్జి' దండకు కట్టుకుంటాడు కిష్టయ్య. గదికి మరోవైపు పాత రాలీ సైకిలు స్టాండువేసి ఉంది.

ఏదో తత్త్వం కూనిరాగంలో గొణుగుతూ ఆగిపోయాడు. ప్రక్క యింటిలో నుంచి నవ్వులు వినబడుతున్నయ్.

“సాయిబుగాడిగిలిస్తున్నాడు దూదేకులదాంతో” వినుకున్నాడు కిష్టయ్య.

పోస్టుకు సమీపంలో తోళ్లషాపొకటుంది. అందులో పనిచేసే చర్మకారులు అక్కడే నాలుగు గుడిసె లేసుకున్నారు. వాళ్లకు చుట్ట, బీడీ, సోడా అమ్ముతాడు సాయిబు రెహ్మాన్.

వాడి జీవితంతో పోల్చుకున్నాడు తన జీవితాన్ని కిష్టయ్య.

'రెహ్మనుకు బాదరబందీ ఉన్నట్టు ఎప్పుడూ కనిపించడు. పిల్లలు లేరు. అనువుగా దొరికిన ఆడదాన్నల్లా తీసుకొస్తాడు. నెలా రెండు నెల లుంచుకుంటాడు. అటుపై దానికి విసుగెత్తడమో, వీడికి మొహం మొత్తడమో జరుగుతుంది. తరువాత రెహ్మాన్ కొత్త మొహాన్ని తెచ్చుకుంటాడు. వాడు కూడా కిష్టయ్యకు ఏదో ఉపదేశించబోతాడు.

కిష్టయ్యకు నలుగురి పిల్లల పోషణ జరగాలి. భార్య మంచిది. సంసారం సరిదిద్దుకుని ఉన్నదాంతో సర్దుకుపోతుంటుంది. పెద్దకొడుకు రిజర్వు కానిస్టేబులు పనిచేస్తూ చచ్చిపోయాడు. పాపం ! కిష్టయ్యకు పెద్దబ్బాయంటే పంచప్రాణాలూను. వాడు పోవడంతో జీవితంమీద ఆశ సడలిపోయింది కిష్టయ్యకు. రెండో కొడుకు వట్టి మేదకుడు. తలిదండ్రులతో చెప్పకుండా పారిపోయి, మిలిటరీలో జేరి, యుద్ధంలో భయానక దృశ్యాల్ని, లెక్కకు మిక్కిలిగా ఉన్న శవాల్ని చూచి బెంబేలుపడి యింటికి పారిపొయ్యొచ్చాడు. వాడి పిరికితనాన్ని, అప్రయోజకత్వాన్ని తిట్టిపోశాడు కిష్టయ్య. వాడిని గూడా తనే యీడ్చుకురావాలి. పెద్దకొడుకు ధైర్యం గలవాడు, అలవిమాలిన దొంగలకేసు ఒక్కడే ప్రాణాల్ని ఖాతరు చెయ్యకుండా పట్టుకున్నందుకు హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషను వచ్చే సమయంలో విషజ్వరం అతన్ని పొట్టన బెట్టుకుంది— అదీ పెళ్లయిన నాలుగో నెలలోనే.

జీవితం కిష్టయ్యను దగాచేసి, అతని జీవనాడుల్ని కృంగదీసింది. పెద్దపిల్ల పెళ్లీడు కొచ్చింది. చిన్నపిల్ల, కడసారివాడు చదువుకుంటున్నారు. భార్యకు ఉబ్బసం వస్తూంటుంది. సంవత్సరానికి రెండు నెలలు ఆస్పత్రిలోనే గడుపుతుంది.

అన్ని సుఖాలూ అతనికి దూరమైనా, నిజాయితీకి మాత్రం దూరంకాలేదు కిష్టయ్య.

జీవితంలో ఒక్కొక్క అనుభవం ఒక్కొక్క పాఠం నేర్పి, తమ దారిన తాము పోతూనే ఉన్నై.

లోయర్‌గ్రేడు పంతులుగా జీవితం ప్రారంభించాడు కిష్టయ్య. అతని అన్న వెంకన్నకు చదువంటే సయించదు గానీ, మంచి వ్యవహారీకుడు, పలుకుబడి గల లౌకికుడు. చుట్టుపట్ల గ్రామాదుల్లో తెలివితేటలకు పేరెన్నికగన్నవాడు. అతడు చెప్పింది వేదాక్షరం కిష్టయ్యకు. "వెధవ పంతులుద్యోగం, మానెయ్‌రా, యవసాయం జేద్దాం' అన్నాడు వెంకన్న తమ్ముడి పంతులు దర్జా చూడలేక.

కిష్టయ్య రాజీనామా పడేశాడు.

కిష్టయ్యది దృఢమైన, కండలు తిరిగిన కాయం. అతడు బుగులు మీసాలతో ఉరిమిచూస్తే, యెదుటివాడిలో జంకు తాలూకు ఛాయలు స్పష్టంగా కనబడేవి. వ్యవసాయం కలిసిరాకపోగా, వెంకన్న మూలంగా ఊళ్లో తగాదాలు పెరిగి, కక్షలు, కార్పణ్యాలు పెచ్చు పెరిగినయ్. కులద్వేషాలు సంద్య చేసుకున్నయ్. వెంకన్నను అక్కసుతో కొట్టారు. కిష్టయ్య కోపంతో రుద్రుడే అయ్యాడు. ఊరు ఊరంతా గజగజ లాడించి శత్రుపక్షంవారి నందరినీ ఒక్కడే తరిమి తరిమి కొట్టాడు. అన్నంటే అమితమైన అభిమానం.

పచ్చగా బ్రతికిన కుటుంబం. కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి, కిష్టయ్య ఆస్తి కర్పూరంలా కరిగిపోయింది. ఇక్కడ కూడా జీవితం అతన్ని చిన్నచూపే చూసింది. వెంకన్న తన పొలం కొంత మిగుల్చుకుని కిష్టయ్యను నిరాధారుణ్ని చేశాడు. అప్పటినుండీ కిష్టయ్య తన స్వయం శక్తిమీద ఆధారపడి జీవితాన్ని వెళ్లదీయవలసొచ్చింది. భార్య యిప్పటికీ గోల బెడుతూనే ఉంటుంది. కిష్టయ్య తన ఖర్మను నిందించుకుంటాడు తప్ప ఎవ్వరినీ ఏమీ అనడు. ఒకవిధంగా, ఆ మంచితనమే అలుసుగా తీసుకుని లోకం అతన్ని వెక్కిరిస్తోందేమో !

'బయ్' మంటూ శబ్ద మయ్యింది. రెండు లైట్లు రోడ్డు మలుపునుండి సూటిగా కిష్టయ్య కళ్లల్లో గుచ్చుకున్నయ్. ఆదరాబాదరా లేచి నిలబడ్డాడు కిష్టయ్య రోడ్డు మధ్యగా. కారు రానే వచ్చింది. ఖాళీ బస్సు. డ్రైవరేదో చెప్పి ముందుకు తోలుకుపోయాడు.

విసుగ్గా మళ్లీ చతికిలబడ్డాడు కిష్టయ్య. రెహ్మాన్ ఉంపుడుగత్తె ఏదో తురకంలో మాట్లాడుతూ నవ్వుతోంది.

'నవ్వుతూ, తుళ్లుతూ సెలయేరులా బ్రతుకుతూ పోవాలంటే, మంచి చెడ్డల ఊసెత్తకుండా నిత్యవినీతుల జోలికి పోకుండా, మమతలూ, బంధాల ప్రసక్తి లేకుండా తిని, త్రాగి, నవ్వుతూ నాలుగు కాలాలు బ్రతకాలి కామోసు' పిచ్చిగా ఆలోచించుకుంటున్నాడు కిష్టయ్య.

మొన్న రెహ్మాన్‌గాడు నవ్వాడు. గడ్డి బండిలో ధాన్యం దాచుకుని దాటేస్తున్నాడు ప్రక్కవూరి రైతు. ఐదు బస్తాల ధాన్యం. కిష్టయ్యకు రావలసినంత కోపం రానే వచ్చింది. రైతు యాభై రూపాయ లిస్తానని బతిమాలుకున్నాడు. లంచం అనేసరికి కిష్టయ్య ఉగ్రుడయ్యాడు. రైతుమీద రిపోర్టు రాయబోయే సమయంలో శనిలా వచ్చాడు సూపర్‌వైజరు. చౌకీదార్లను తనిఖీ చేసేందుకు అతగాడు వస్తూంటాడు. దొంగ ధాన్యం తతంగం చూశాడు. రైతు లౌక్య మెరిగినవాడు. సూపర్‌వైజరును చాటుకు తీసుకువెళ్లాడు. మర

క్షణంలో "ఇదుగో కిష్టయ్యా! ఏదో పాపం, పేదరైతు, చాలా మంచోడులా గున్నాడు, ఇవాళ్టికి వదిలెయ్. ఏమన్నా వస్తే నే జూసుకుంటా' అని సమాధానం కోసం ఎదురుచూడకుండా రైతును సాగనంపాడు. సూపర్‌వైజరు—డబ్బులు పిక్కించుకున్నాడు మరి. అంతకుముందే రెహ్మాన్ కిష్టయ్యకు చెప్పి చూచాడు 'తృణమో—పణమో' వచ్చింది రాబట్టుకొమ్మని. ఆత్మవంచన చేసుపోకోవడం కిష్టయ్య జన్మలో జరగని పని. ససేమిరా అన్నాడు. ఇప్పుడు తన పై ఉద్యోగే ఆపని చేశాడు. కిష్టయ్య తన అసహాయతను నిందించుకున్నాడే తప్ప, 'కాళ్ల దగ్గర కొచ్చిన డబ్బును కాలదన్నుకున్నా నేమా' అన్న భావం అతనికి ఏ కోశానా కలుగలేదు. అయితే రెహ్మాన్ నవ్వింది మాత్రం 'సిరిరా మోకాలొడ్డే' కిష్టయ్యను చూసి.

ఎదురుగా ఉన్న తాటితోపులో పుంజీభవించిన చీకటితో పెనగులాడుతోంది మసక వెన్నెల.

చీకటి శబ్దం చేస్తున్నట్లు 'రయ్' మంటూ దూసుకొస్తోంది లారీ. చప్పున నిలబడ్డాడు కిష్టయ్య. లారీ యొక్క వేగం, ధ్వని యినుమడిస్తున్నయ్. లైట్లు మెరపులాగా ఆకస్మికంగా వెలిగి ఒక్కసారిగా ఆరిపోయినయ్. కిష్టయ్య కళ్లు జిగ్గుమన్నయ్. కళ్లు బైర్లు కమ్మి చీకటిచుక్కల్ని చూస్తున్నయ్. కన్ను మూసి తెరిచేలోగా 'రంయ్' మంటూ అతన్ని దూసుకుపోయింది లారీ! 'అమ్మా!' అంటూ కంకర రోడ్డు ప్రక్కన పడ్డాడు కిష్టయ్య. తల దిమ్మెక్కింది. చెయ్యి తిమ్మిరెక్కింది. చేతిలో టార్చి వెలిగింది. లారీ నంబరు గొణిగింది గొంతు. "ఎమ్. డి. డబ్ల్యు. 204". "ఫట్" మన్న శబ్దం వినబడింది. మరు క్షణంలో లారీ కనుచూపుమేరలో ఉంది—

కిష్టయ్య భారంగా లేచాడు. సైకిలు తీసుకున్నాడు. చేతి నరాలు పీకుతున్నయ్. ఓపికనంతా కూడదీసుకుని సైకిలు మీద, లారీని వెంబడించాడు.

టౌన్‌లోనికి చొచ్చుకుపోయింది లారీ. ఒక సందు మలుపులో ఆగిపోయింది. కిష్టయ్య లారీని చేరుకున్నాడు, డ్రైవరు లేడు. ఎవ్వరూ లేరు. లారీ అంతా పరీక్షించాడు. లారీ నిండుగా బియ్యపు బస్తాలు. పళ్లు పటపట నూరాడు. తన పథకం నెరవేరబోతున్నందుకు సంతోషంగా, గర్వంగా కూడా ఉంది కిష్టయ్యకు. తన పట్టుదలకు తనే ఆశ్చర్యపోతూ లోలోన మురుస్తున్నాడు. వెంటనే రేషనింగు ఆఫీసరుకు ఫోనిద్దా మనుకుంటున్నాడు.

తెల్లని దుస్తుల్లో ఒక ఆకారం ప్రవేశించింది. టార్చి వేశాడు కిష్టయ్య. వ్యక్తిని పరకాయించి చూచాడు. ఆశ్చర్యపడలేదు. అర్థం చేసుకున్నాడు. ఆగంతకుడు పేరు మోసిన మిల్లు యజమాని. లేని నవ్వు తెచ్చిపెట్టుకుని "చాకీదారుగారూ! మమ్మల్ని పట్టిస్తే మీకేం ఒరుగుతుంది. నామాట విని యీ ఐదొందలుంచండి'. రూపాయల కట్టలు చేతిలో పెట్టబోతూ 'మమ్మల్ని ఒదిలెయ్యండి ఎందుకు యిరుకున బెడతారు' బతిమాలే ధోరణిలో అంట్టున్నాడు గ్లాస్కో దుస్తుల్లోని మిల్లు యజమాని.

కిష్టయ్య అగ్నికీలలా భగ్గుమన్నాడు. మిల్లు యజమానిని కసిరికొట్టాడు. వెంట్రుకవాసిలో తన ప్రాణం పోయేది. అలాంటి ఘాతుకాలు చేసేవాళ్లని సహించగూడదని నోరు చేసుకోబోతుంటే చల్లగా జారుకున్నాడు మిల్లు యజమాని. అనుభవజ్ఞుడు మరి!

మరుసటిరోజు. సాయంత్ర మయ్యింది. వెలుగురేఖల్ని తరిమి కొడుతున్నయ్ సంధ్య చీకట్లు.

సూపర్‌వైజ రొచ్చాడు. "కిష్టయ్యా! భలే ధైర్యం గలోడివోయ్. నిన్ను మెచ్చుకుంటూ గవర్నమెంటు సర్టిఫికెట్టిచ్చింది బియ్యపులారీని పట్టుకున్నందుకు ఇంద' అన్నాడు కిష్టయ్యకు టైప్ చేసిన కాగితం అందిస్తూ.

"లారీ డ్రైవర్ను, ఓనర్ని యేంచేశారండీ ?" ఆత్రంగా అడిగాడు కిష్టయ్య సర్టిఫికెట్టందుకుంటూ, ఇన్నాళ్లకు తన సంకల్పాన్ని నెరవేర్చుకో గలిగానని.

"ఆ .... ! ఏంచేస్తారోయ్ ? ఇద్దరికీ కలిపి మూడొందలు జరిమానా వేశారు. మనలో మనమాట, ఆ మిల్లు ఓనరుకు ఆ జరిమానా ఒక లెఖ్కా. ఎక్కడా అనకు, మన ఆఫీసరుకు వెయ్యి ముట్టినయ్'—

కిష్టయ్య చేతిలో కాగితం రెపరెప లాడింది.